
# యూజీడీ పనుల జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశం



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** సూర్యాపేట పట్టణంలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల తీరుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పనుల జాప్యం, తవ్విన రోడ్లను నెలల తరబడి పునరుద్ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్లు, మ్యాన్‌హోల్‌ల నిర్మాణం పూర్తైన వెంటనే గోతులు పూడ్చి, సీసీ రోడ్లను పునరుద్ధరించాలని ఆదేశించారు. తవ్వకాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైపులు, ఇతర మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయాలని సూచించారు. యూజీడీ పనులు జరుగుతున్న అన్ని ప్రాంతాలకు రోడ్డు వారీగా టైమ్‌లైన్‌తో కూడిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# డీఎస్పీ, టూ టౌన్ సీఐ కార్యాలయాలపై ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**నల్లగొండ బ్యూరో,శుభోదయ డైనమిక్** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ నల్లగొండ డీఎస్పీ కార్యాలయం, టూ టౌన్ సీఐ కార్యాలయాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పెండింగ్ దర్యాప్తుల పురోగతిని సమీక్షించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హత్యలు, దోపిడీలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ నమోదు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, వారెంట్ల అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో డీఎస్పీ శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# 27 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేరేడుచర్లలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో రోజంతా గడిపారు. నాటి గురువులు తమకు విజ్ఞానంతో పాటు జీవిత విలువలు నేర్పి, ఎదుగుదలకు బలమైన పునాదులు వేశారని వారు పేర్కొన్నారు. పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో అప్పట్లో సాంఘిక శాస్త్రం బోధించిన ఉపాధ్యాయుడు వంగాల రుక్మారెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు బట్టు మధును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసా కరుణాకర్, జె. సోమయ్య, మచ్చ రవి, నాగరాజు, నాగయ్య, అరుణ, విజయలక్ష్మి, రజిత, ధనలక్ష్మి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ హరివిల్లు క్లబ్ అధ్యక్షుడిగా కొత్తా లక్ష్మణ్



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ నేరేడుచర్ల హరివిల్లు శాఖ అధ్యక్షుడిగా కొత్తా లక్ష్మణ్ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో 2026 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రీజనల్ సర్వీస్ డైరెక్టర్‌గా సరికొప్పుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పోలిశెట్టి శ్రీధర్, కోశాధికారిగా పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష అనుభవం కలిగిన లక్ష్మణ్ గతంలో వాసవి క్లబ్‌లో పలు బాధ్యతలు నిర్వహించి సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డులు అందుకున్నారు. నూతన బాధ్యతలతో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. వారి ఎంపికపై పట్టణ ప్రజలు, వాసవి వనితా క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలు తీర్చడమే తన లక్ష్యం

చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్




**చౌటుప్పల్ ,శుభోదయ డైనమిక్** మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలు తీర్చడంకోసమే మీ ముందుకొస్తున్నానని చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీలోని వలిగొండ రోడ్ల గల బీటీ రోడ్డు గతంలో రెండుసార్లు మరమత్తులు చేయగా, మళ్లీ భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. ఈరోజు చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ చొరవతో మళ్లీ ఈరోజు వలిగొండ రోడ్ లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కోర్టుకు వెళ్లే దారి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు, 15 రోజులు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ తో మాట్లాడి ఎమ్మెల్యే మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బిటి రోడ్డు శాశ్వత పరిష్కారం చేస్తామని అన్నారు,వాహనదారులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ అధికారుల కళ్లముందే అక్రమ నిర్మాణాలు

హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రజల్లో ఆగ్రహంలి..!




**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్** : హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఎదురుగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేసినప్పటికీ, నిర్వాహకులు వాటిని లెక్కచేయకుండా యథేచ్ఛగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. అధికారుల నోటీసులు అందిన తర్వాత మరింత వేగంగా పనులు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి బోర్లు వేయడంతో పాటు మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తి కాకముందే షాపుల అద్దెల పేరుతో లక్షల రూపాయల అడ్వాన్సులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అన్ని నిబంధనలను తుంగలో తొక్కుతూ బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం మౌనంగా ఎందుకు వ్యవహరిస్తున్నారంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు మాధ్యమాల్లో వార్తలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజా స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నా చర్యలు లేకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పట్టణంలో గతంలో చిన్న స్థాయి ఉద్యోగిగా పనిచేసి ప్రస్తుతం పెద్ద స్థాయి ఉద్యోగిగా ఎదిగిన ఓ ప్రముఖ ఉద్యోగి ఈ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ "నేనున్నాను" అంటూ భరోసా ఇస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అధికార యంత్రాంగంలో తన ప్రభావాన్ని ఉపయోగించి అక్రమ నిర్మాణాలకు మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దఈ విషయాన్ని త్వరలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానికులు సిద్ధమవుతున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, మున్సిపల్ నోటీసుల ప్రతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

# బుర్రి శ్రీనివాస్ అరుణల కూతురు బుర్రి జశ్విత శ్రీ ఐఐటి బాసరలో సీటు




**శుభోదయ డైనమిక్ న్యూస్, మే 31, సూర్యాపేట** : సూర్యపేట పట్టణంలోని స్థానిక భగత్ సింగ్ నగర్ లో గల మోంటిస్సోరి హైస్కూల్ విద్యార్థిని దీ. జశ్విత శ్రీ 10 ^వ^ ఫలితాల్లో 579/600 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. నిన్న ప్రకటించిన ఐఐటీ బాసర(=జీఖఖు) ఫలితాలలో సీటు సంపాదించినది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు బుర్రి శ్రీనివాస్ అరుణ లు మరియు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఇట్టి విదార్థినిని పాఠశాల కరెస్పాండెన్ రణబోతు రవీందర్ రెడ్డి సుజిత అభినందించారు.

# ఘనంగా కౌన్సిలర్ సులువ చంద్రశేఖర్ నాగలక్ష్మి ల కుమార్తె నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలు



**శుభోదయ డైనమిక్ హుజూర్ నగర్** హుజూర్ నగర్ 3 వ వార్డ్ కౌన్సిలర్ సులువ చంద్రశేఖర్ నాగలక్ష్మి ల కుమార్తె మనోజ్ఞ నూతన పట్టు వస్త్రలంకరణ వేడుకలు కోదాడ రోడ్ గల కౌండిన్య ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి 19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ గౌడ్ హాజరై చిన్నారి మనోజ్ఞ ను ఆశీర్వదించారు. ఇట్టి కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ షేక్ సైదా, కౌన్సిలర్ బెల్లంకొండ లలిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న కీసర సంతోష్ రెడ్డి



**శుభోదయ డైనమిక్** , మోతే మోతే మండలం రాఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల రవి రజిని కుమార్తెల నూతన పట్టువస్వంకరణ వేడుక రాఘవ పిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా మోతే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు ఈ యొక్క కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు. రాఘవపురం ఎక్స్ రోడ్ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్. హలవత్ స్వామి నాయక్. మద్ది మంజుల భాస్కర్ రెడ్డి. గ్రామ శాఖ అధ్యక్షులు నాగమల్లయ్య గౌడ్. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొలిపెల్లి విక్రమ్. మండల ప్రధాన కార్యదర్శి మండ వ శ్రీనివాస్ గౌడ్. గ్రామ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న కీసర సంతోష్ రెడ్డి



**శుభోదయ డైనమిక్ , మోతే** మోతే మండలం రాఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల రవి రజిని కుమార్తెల నూతన పట్టువస్వంకరణ వేడుక రాఘవ పిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా మోతే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు ఈ యొక్క కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు. రాఘవపురం ఎక్స్ రోడ్ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్. హలవత్ స్వామి నాయక్. మద్ది మంజుల భాస్కర్ రెడ్డి. గ్రామ శాఖ అధ్యక్షులు నాగమల్లయ్య గౌడ్. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొలిపెల్లి విక్రమ్. మండల ప్రధాన కార్యదర్శి మండ వ శ్రీనివాస్ గౌడ్. గ్రామ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ కౌన్సిలర్ ల మధ్య ఎలాంటి విబేధాలు లేవు. 19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ నాయకత్వంలో మేమంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేస్తున్నాము. కౌన్సిలర్ల మధ్య ఎలాంటి విభేదాలు లేదా గ్రూపులు ఉన్నాయని వస్తున్న పత్రిక వార్తలు పూర్తిగా అవాస్తవం. మున్సిపల్ కౌన్సిలర్ ల మధ్య బేధాభిప్రాయాలు ఉన్నాయని ప్రజల్లో గందరగోళం సృష్టించే అసత్యపు వార్తలు రాస్తే ఈసారి తీరువా పరిణామాలు ఉంటాయని 19 వార్డు కౌన్సిలర్ కృష్ణ తీవ్రంగా ఖండించారు

# అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు..

జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు..




**శుభోదయ డైనమిక్ న్యూస్, మే 31, సూర్యాపేట** : ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే ఎప్పటికీ తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయ అధికారి వడ్డే శ్యామ్ సుందర్ రెడ్డి పదవి విరమణ వీడ్కోలు సన్మానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా గ్రంథాలయ అధికారిగా వృత్తిలో క్రమశిక్షణ, పట్టుదల,సత్ ప్రవర్తన కలిగి, అంకితభావంతో తమ వృత్తిని సజావుగాకొనసాగించారని తెలిపారు. నిబద్ధతతో పనిచేసి అందరి మన్ననలు పొందాడని కొనియాడారు. సూర్యాపేట గ్రంథాలయంలో ఉద్యోగం చేస్తూ రాష్ట్ర ఉత్తమ గ్రంథాలయ అధికారి గ్రహీత అవార్డు అందుకున్నారు. నేడు పదవి విరమణ చేయడం అందరికీ బాధాకరంగానే ఉన్నప్పటికీ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని వారి భావి జీవితం సమాజసేవలో కొనసాగుతూ గడిచిపోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలమ్మ, మనోజ్ కుమార్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు వేణుగోపాలచార్యులు, శ్రవణ్ కుమార్, రుకోధర్, రిటైర్డ్ ఉద్యోగులు సురేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, రంగారావు కృష్ణారెడ్డి, యాదగిరి రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో పిల్లల ఈతలు.. వ్యాయామంతో పాటు ఈతలో నైపుణ్యం



**శుభోదయ డైనమిక్ చిలుకూరు** చూలుకూరు గ్రామ శివారులోని వ్యవసాయ బావి చిన్నారుల కేరింతలతో సందడిగా మారింది. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలు బావిలో ఈతలు నేర్చుకుంటున్నారు. ప్రతిరోజూ స్నేహితులతో కలిసి బావికి చేరుకుని ఈత సాధన చేస్తూ శారీరక వ్యాయామాన్ని పొందుతున్నారు. ఈత వల్ల శరీర దారుఢ్యం పెరగడంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందని పిల్లలు చెబుతున్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఈతలో నైపుణ్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. పిల్లల ఉత్సాహాన్ని చూసి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈత సాధన సమయంలో తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణలో ఉండి భద్రతా జాగ్రత్తలు పాటించాలని గ్రామ పెద్దలు సూచించారు.

# మఠంపల్లి మండలంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు ప్రజలకు శాపంగా మారాయి...!



**శుభోదయ డైనమిక్ న్యూస్ మఠంపల్లి** :సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు ప్రజలకు శాపం గా మారాయి. కోట్ల రూపాయల వ్యయంతో రైల్వే లైన్లు నిర్మిస్తున్న అధికారులు, కాంట్రాక్టర్లు ప్రజల రాకపోకల సమస్యలను మాత్రం పూర్తిగా విస్మరించారని గ్రామస్తులు మండిపడుతున్నారు. మఠంపల్లి మండల పరిధిలో రేణిగుంట తండా, తీగలచెరువు తండా,మంచ్య తండా, తుమ్మల తండా, కాల్వపల్లి తండా, లాలి తండా, అవిరేణిగుంట తండా, తదితర గ్రామాలకు వెళ్లే దాదాపు 13 రైల్వే అండర్ పాసులలో చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలువ ఉండటం సాధారణంగా మారిపోయింది వర్షం పడిన తర్వాత రోజులు, గడిచిన నీరు బయటికి వెళ్లే మార్గం లేక అండర్ పాస్ లు చెరువులను తలపిస్తున్నాయి. స్థానిక ప్రజలు రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అంతేకాకుండా స్కూల్ పిల్లలు స్కూల్ కి వెళ్లాలంటే అందులో నడవాలి అంటే యూనిఫామ్స్ తడిచి బూట్లు తడిచే నలువలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అని ప్రజలు తెలియపరిచారు

